ఘనంగా ద్వారం వెంకటస్వామి జయంతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రపంచ ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు పద్మశ్రీ డాక్టర్ ద్వారం వెంకటస్వామి నాయుడు 131వ జయంతి గురువారం ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోయేషన్ ఆధ్వర్యాన ఘనంగా జరిగింది. కొత్తపేట మండపం వద్ద గల ఆ సంస్థ కార్యాలయం ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ద్వారం చిత్రపటానికి ఆ సంస్థ సభ్యులు ధవళ సర్వేశ్వర రావు, మహేశ్వర రావు, విద్వాంసులు నాయుడు పూలమాలలు వేసి నిఘలర్పించారు. ప్రముఖ వయొలిన్ విద్వాంసుడు మావుడూరు సత్యనారాయణ శర్మ వయొలిన్ కచేరీ అందరినీ అలరించింది.

వయొలిన్ వాయిస్తున్న సత్యనారాయణ

అపార్ ప్రక్రియను వేగవంతం చేయండి

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఇఒలు, హెడ్‌మాస్టర్లతో గురువారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో, జిల్లాలో అపార్ జారీ ప్రక్రియపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఎంఇఒలు ప్రత్యేక దృష్టిపెట్టి త్వరగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పుట్టినతేదీ ధ్రువపత్రాలు లేకపోవడం వల్లే అపార్ ఆలస్యం అవుతోందని, కొంతమంది తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రతీ పాఠశాల హెచ్‌ఎం తమ పాఠశాలలో బర్త్ సర్టిఫికేట్లు లేని విద్యార్థుల జాబితాలను శుక్రవారం నాటికి సిద్ధం చేసి, వారిచేత వెంటనే సచివాలయాల్లో సర్టిఫికేట్ల కోసం దరఖాస్తు చేయించాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి బర్త్ సర్టిఫికేట్లను వెంటనే మంజూరు చేయాలని, ఈ ప్రక్రియ మంగళవారం నాటికి పూర్తి చేయాలని తాహశీల్దార్లను ఆదేశించారు. ప్రయివేటు పాఠశాలలకు కూడా తగిన ఆదేశాలను జారీ చేయాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేయాలని, రుచికరంగా ఉండేలా చూడాలని ఎంఇఒలకు, హెచ్‌ఎంలకు కలెక్టర్ సూచించారు. మరుగుదొడ్ల నిర్వహణను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతో పాఠశాలలను తనిఖీ చేయించి, వెంటనే నివేదికలను పంపించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఇఒ మాణిక్యం నాయుడు, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిపిఒ టి.వెంకటేశ్వరరావు, సచివాలయాల ప్రత్యేకాధికారి నిర్మలాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యా శాఖ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష

జిల్లాలో ప్రస్తుతం బడిబయట వున్న పిల్లలు ప్రస్తుతం ఎక్కడ వున్నారో, వారేం చేస్తున్నారో విద్యార్థుల వారీగా నివేదిక రూపొందించాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సుమారు పదివేల మంది బడి బయట వుండవచ్చని డిఇఒ తెలుపగా వారంతా ప్రస్తుతం ఏయే స్కూళ్లలో చేరారో, లేదా ఏయే పరిస్థితుల్లో వున్నారో తెలుసుకునేందుకు అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీనిపై అధ్యయనానికి గ్రామ సచివాలయ సిబ్బంది సహాయం తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం అమలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. సమగ్రశిక్ష ద్వారా జరుగుతున్న పాఠశాలల భవనాలు, ఆటస్థలాల నిర్మాణం తదితర పనుల గురించి తెలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి నూతనంగా బాధ్యతలు చేపట్టినందున మరో పదిహేను రోజుల్లో శాఖపై పూర్తిస్థాయిలో సమీక్ష చేస్తామని చెప్పారు. డిఇఒ మాణిక్యాలనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

విశాఖపట్నం-రాయపూర్ జాతీయ రహదారిలో

తాటిపూడి సాగునీటి కాలువపై బాక్స్ కల్వర్టు నిర్మాణం

ప్రజాశక్తి-విజయనగరంకోట

సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విశాఖపట్నం-రాయపూర్ జాతీయ రహదారి కొర్లాం గ్రామపరిధిలో బాక్స్ కల్వర్టు నిర్మాణ సమస్య కానుంది. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో ఇది నిర్మాణం కానుంది. దీంతో ఎన్నో ఏళ్ళుగా ఆ ప్రాంత ప్రజలు, ఆరు వందల ఎకరాలకు సాగునీటి కోసం ఉద్దేశించిన ఈ కల్వర్టు నిర్మాణం వల్ల మూడు గ్రామాలకు చెందిన వందలాది మంది రైతుల సాగునీటి సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. కొర్లాం గ్రామ పరిధిలో చెరుకు కాటా దగ్గరలో ఉన్న డొంకలగడ్డ నుంచి జగన్నాధపురం వెళ్లే తాటిపూడి ప్రాజెక్టు ఇరిగేషన్ కెనాల్ నీటి ప్రవాహం కోసం గతంలో పైప్ లైన్ కల్వర్టు ఉండేది. గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి గా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఈ కల్వర్టును బాక్స్ కల్వర్టు నిర్మించాలని స్థానిక రైతులు ఏడాదిగా ఆందోళన చేస్తున్నారు . ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులను సంప్రదించి ఈ ప్రాంతంలో బాక్స్ కల్వర్టు నిర్మాణానికి ఒప్పించారు.

చెరుకుపల్లి కొండ ప్రాంతం

చెరుకుపల్లి కొండ వ్యవహారంలో

ఆర్‌డిఒ, తహశీల్దార్‌పై విచారణ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని చెరుకుపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న కొండను జిరాయితీ భూమిగా మార్చిన వ్యవహారంలోనే అప్పటి ఆర్‌ఒడిఒ భవానీ శంకర్, తహశీల్దార్ రమణమ్మపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. గత ప్రభుత్వ హయాంలో ఈ కొండను జిల్లా నుంచి మండలస్థాయి వరకు పనిచేసిన రెవెన్యూ అధికారులు 20 ఎకరాలను నలుగురు మాజీ సైనికులకు కేటాయించినట్లు రికార్డులను మార్చేశారు. మాజీ సైనికుల నుంచి వెనువెంటనే మరో మూడు చేతులు మారిపోయింది. ఆ తరువాత జిల్లా కలెక్టర్‌గా వచ్చిన సూర్యకుమారి జిల్లాస్థాయి అధికారిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అనంతరం రీసర్వేలో దీనిని మళ్ళీ ఎటువంటి లావాదేవీలు జరగకుండా 22ఏ క్రింద కలెక్టర్ అదేశాలతో మార్చారు. అయితే ఈ ప్రభుత్వ భూమిని కాపాడలేదనే ఉద్దేశంతో ఈ వ్యవహారంలోనే ఆర్‌డిఒ భవానీశంకర్, తహశీల్దారు రమణమ్మపై ప్రభుత్వం తాజాగా విచారణకు ఆదేశించింది.

మరో ఇద్దరు తహశీల్దార్లకు భాగస్వామ్యం?

ఈ కొండ వ్యవహారంలో అప్పట్లో మరో ఇద్దరు తహశీల్దార్లకు కూడా భాగస్వామ్యం ఉంది. ఇందులో ఒక మహిళా తహశీల్దారు మృతి చెందారు. వీరిద్దరిదే ప్రధాన పాత్రని పలువురు అంటున్నారు. ఆ తరువాత రమణమ్మ తహశీల్దారుగా వచ్చారు. ఇందులో ఈమె పాత్ర ఎంత ఉందనేది విచారణలో తెలియాల్సి ఉంది. ఆమె కూడా గతంలో ప్రభుత్వానికి ఒకసారి వివరణ ఇచ్చినట్లు సమాచారం. కాని ప్రభుత్వం మళ్ళీ విచారణకు ఆదేశించడంతో రెవెన్యూ శాఖలో కలకలం రేగింది. ప్రస్తుతం విచారణ అధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌ను ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే.

పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మహిళా పోలీసు స్టేషన్లో 2021 సంవత్సరంలో నమోదైన పోక్సోకేసులో నిందితుడు విజయనగరానికి చెందిన కుమిలి సురేష్ (26)కు 20ఏళ్ల జైలుశిక్ష శిక్ష, రూ.5500 జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి గురువారం తీర్పు వెల్లడించినట్లుగా ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. నగరానికి చెందిన 15ఏళ్ల బాలికను మంగళవీధికి చెందిన సురేష్ పెళ్ళి చేసుకుంటానని నమ్మించి, మోసం చేసి తరచూ ఆమె ఇంటికి వెళ్ళి బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు మహిళా పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్‌ఐ కె.టి.ఆర్ లక్ష్మి పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేశారు.

ఈ కేసును అప్పటి దిశా మహిళా పిఎస్ డిఎస్‌పి టి.త్రినాధ్ దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు.నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్‌పి తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఎంపిడిఒకు షోకాజ్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించినందుకు బోగాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్‌కు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అధికారి, జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాస మూర్తి ఈ విషయం తెలిపారు.



పోలీసు అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

సాంకేతిక నైపుణ్యంతో సైబరు నేరాల నిరోధం

పోలీసుల ప్రత్యేక శిక్షణలో ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

కంప్యూటరు నైపుణ్యం, మెళకువలతో సైబరు మోసాలను సులువగా ఛేధించవచ్చునని ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కాలేజీలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో పోలీసు అధికారులకు 'సైబరు నేరాల దర్యాప్తు' కు చేపట్టాల్సిన మెళుకవులు, సాధించాల్సిన నైపుణ్యంపై నిర్వహించిన శిక్షణలో ఎస్‌పి మాట్లాడారు. ప్రస్తుతం నేరాల తీరు మారుతున్నదని, ప్రతీ నేరం కూడా సైబరు క్రైం, సాంకేతికతతో ముడిపడి ఉంటున్నదన్నారు. ఈ నేరాలను ఛేధించేందుకు దర్యాప్తు అధికారులకు కూడా ప్రత్యేకమైన శిక్షణ, వృత్తి నైపుణం అవసరమన్నారు. వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకుంటే రాబోయే రోజుల్లో సైబరు నేరాల దర్యాప్తు సులభతరం అవుతుందని, సైబరు మోసాలకు, నేరాలకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి, చట్ట పరిధిలో శిక్షించడంతోపాటు, వారు దోచుకున్న నగదును తిరిగి రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు దర్యాప్తు అధికారులకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని అందించేందుకుగాను ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపర్చుకొని, భవిష్యత్తులో పోలీసుశాఖకు పెను సవాలుగా నిలిచే సైబరు క్రైమ్‌కు అడ్డుకట్ట వేయాలని ఎస్‌పి తెలిపారు. అనంతరం సైబరు నిపుణులు సాయి రామానుజ మాట్లాడుతూ - సైబరు నేరాలను, మోసాలను ఛేధించడం చాలా సులభమని, అందుకు అవసరమైన అవగాహన, వత్తి నైపుణ్యం దర్యాప్తు అధికారులకు అవసరమన్నారు. కొన్ని మెళుకువలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించగలిగితే చాలా సైబరు మోసాలను ఛేధించ వచ్చునన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, పార్వతీపురం మన్యం అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతకుముందు జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉప సంచాలకులు ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మిని ఎస్‌పి మర్యాద పూర్వకంగా కలిసారు. యూనివర్సిటీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పిని సత్కరించారు

అనారోగ్యం బారిన పడకుండా చర్యలు చేపట్టండి

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు కోరారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల మృతిపట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేసారు. విద్యార్థుల మృతికి గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మన్యం జిల్లా కలెక్టర్ ను కోరారు. మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థితో పాటు, కురుపాం గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందిన సమాచారం తెలుసుకున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆశ్రమ పాఠశాల నిర్వహణ, నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసారు. ఒక్కరోజు వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన పరిస్థితులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో పరిశుభ్రమైన తాగునీరు, మౌలిక సదుపాయాలతో పాటు దోమ తెరలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలలో ఎటువంటి చర్యలు చేపట్టారో సమగ్ర నివేదికలను అందజేయాలని పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు విజయనగరం,అల్లూరి సీతారామరాజు ,శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లకు ఆదేశించారు. ఆయా జిల్లాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల నిర్వహణ, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై కలెక్టర్లు దృష్టి సారించాలని కోరారు.

ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలి

రైల్వే స్టేషన్ మాస్టర్‌కు డివైఎఫ్ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రైల్వేశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి రీ-ఎంగేజ్‌మెంట్‌ను అమలు చేయాలని భారతీయ రైల్వే ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని డివైఎఫ్ఐ వ్యతిరేకిస్తోంది. కేంద్రప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకొని ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విజయనగరం స్టేషన్ మాస్టర్ మురళీకి డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్. హరీష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ ఈ విధానం యువత సామర్థ్యాన్ని బలహీనపరిచే విధంగా ఉందన్నారు. దేశంలో ఇప్పటికే నిరుద్యోగం తారస్థాయిలో పెరుగుతున్న తరుణంలో రైల్వే శాఖలో 2.98 లక్షలు ఉద్యోగాలు ఖాళీగా ఉండగా, అర్హత కలిగిన నిరుద్యోగులను పక్కన పెట్టి కాంట్రాక్ట్ ప్రాతిపదికన రిటైర్డ్ ఎంప్లాయిస్‌ను తీసుకోవడం దుర్మార్గమని అన్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానన్న ప్రధాని మోడీ అందుకు భిన్నంగా యువత భవిష్యత్తును నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరించడం దుర్మార్గమని ఖండించారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 9.8 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి యువతకు ఉపాధిని దూరం చేస్తుందని తెలిపారు. భారత రైల్వేలో 2023 జూన్ 1 నాటికి 2,61,233 పోస్టులు అందులో కేవలం సేఫ్టీ కేటగిరీలో 53,178 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రాజ్యసభలో లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారని, ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించడం అన్యాయమని పేర్కొన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వినతిచ్చిన వారిలో డివైఎఫ్ఐ నాయకులు దుర్గాప్రసాద్, కిరణ్ ఉన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న శంబంగి వెంకటచినప్పలనాయుడు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకుంటాం

వైసిపి జిల్లా అధ్యక్షులుశ్రీనివాసరావు

ఎమ్మెల్సీ అభ్యర్థిగా శంబంగి నామినేషన్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

శాసనమండలి స్థానిక సంస్థల విజయనగరం ఎమ్మెల్సీ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకుంటామని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వైసిపి అభ్యర్థిగా శంబంగి వెంకట చినప్పలనాయుడు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ కు తన నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఎస్.వి.చిన అప్పల నాయుడుతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాస్ మూర్తి తదితర అధికారులు నామినేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు 743 మంది ఉన్నారని, వారిలో 590 మంది వరకు తమ పార్టీకి చెందిన వారు ఉన్నారని తెలిపారు. 2021లో ఏ విధంగా అయితే ఈ స్థానాన్ని గెలుచుకున్నమో అదే విధంగా ఇప్పుడు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కొంతమంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు నాలుగు నెలల కూటమి పాలనకు విసిగిచెంది తమ పార్టీ వైపు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, జెడ్‌పిటిసి సభ్యులు, కార్పొరేటర్లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నగరంలో ఇంటింటా జియో ట్యాగింగ్

విజయనగరం టౌన్ :ప్రతి సచివాలయ కార్యదర్శి ఆయా పరిధిలో ఇంటింటి జియో ట్యాగింగ్ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రతి విభాగానికి చెందిన కార్యదర్శి ఆయా విభాగాల వారీగా గృహస్థుల వివరాలను సేకరించి నిక్షిప్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాల మేరకు ఇంటింటి జియో ట్యాగింగ్ విధానం శరవేగంగా సాగుతోంది.

అట్టాడ ధనుశ్రీ , దీక్ష శ్రీని అభినందిస్తున్న తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు అక్కా చెల్లెలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా డెంకాడ మండలం అక్కివరం గ్రామానికి చెందిన అక్కా చెల్లెళ్లు అట్టాడ ధనుశ్రీ , అట్టాడ దీక్ష తైక్వాండోలో ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నారు. గత నెల 4,5 తేదీలలో కడప జిల్లా రైల్వే కోడూరులో జరిగిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19 పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ధనుశ్రీ ఎంపికైంది. డిసెంబర్ 18 నుండి 25 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఆమె వెళ్లనుంది. అట్టాడ దీక్షశ్రీ కూడా అక్క బాటలో నడుస్తూ ఉత్తమ ప్రతిభను కనబరుస్తోంది. గత నెల 6, 7 తేదీలలో తిరుపతిలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 8 నుండి 12 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం విదీశ జిల్లాలో జరుగునున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననుంది.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తరించాలి

75వ ఆవిర్భావ దినోత్సవంలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

గొప్ప సేవా దృక్పథంతో జాతికి విశేష సేవలను అందిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను మరింత విస్తరించాలని జిల్లా కలెక్టర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ 75 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈవేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరై, విశేష ప్రతిభ చూపిన 10మంది స్కౌట్స్, గైడ్స్‌కు రాజ్యపురస్కార్ సర్టిఫికేట్లను బహూకరించి, వారిని అభినందించారు. స్కౌట్స్ ప్రదర్శించిన విన్యాసాన్ని తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కౌట్స్ మరియు గైడ్స్ సేవలను కొనియాడారు. సేవా దృక్పథంతో ముందుకు వెళ్తున్న ఈ సంస్థకు అత్యంత ప్రాముఖ్యత ఉందని అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8,9,10 తరగతి విద్యార్థులను ఈ ఉద్యమంలోకి తీసుకురావాలని సూచించారు. దశలవారీగా ప్రయివేటు పాఠశాలలకు కూడా విస్తరిస్తామని ప్రకటించారు. జిల్లా విద్యాశాఖాధికారి, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఛీఫ్ కమిషనర్ మాణిక్యం నాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల్లో చిన్ననాటినుంచే దేశభక్తిని పెంపొందించేందుకు దోహదపడుతుందని అన్నారు. మంచి పౌరులను తీర్చిదిద్దడానికి ఉపయోగపడే ఈ కార్యక్రమం మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి వి.చిన్నంనాయుడు మాట్లాడుతూ, ఈ ఉద్యమ చరిత్రను వివరించారు. 1907లో కేవలం 20 మందితో ప్రారంభమైన ఈ ఉద్యమం, తరువాత కాలంలో 174 దేశాలకు విస్తరించిందని తెలిపారు. 1950 నవంబరు 7నుంచి దేశంలోని వివిధ సంస్థలన్నీ ఒకే గొడుగుక్రిందకు వచ్చి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటయ్యిందని చెప్పారు. జిల్లాలో కార్యకలాపాలు బాగా జరుగుతున్నాయని, కొత్తవలస జెడ్‌పి ఉన్నతపాఠశాల విద్యార్థి ఆర్‌డి సోమేశ్వర్రావు రాజ్యపురస్కార్‌కు ఎంపికై, గవర్నర్ చేతులమీదుగా అందుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిసి బోర్డు కార్యదర్శి సన్యాశిరాజు, జిల్లా స్కౌట్స్ కమిషనర్ ఈపు విజయకుమార్, గైడ్స్ కమిషనర్ సౌభాగ్యలక్ష్మి, ఇతర ప్రతినిధులు, హెడ్‌మాష్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్య పు రస్కార్‌కు ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్

డిసెంబర్ 15 నాటికి అర్బన్ రీ సర్వే పూర్తి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

శిక్షణలో మాట్లాడుతున్న కమిషనర్

నగర పరిధిలో చేపట్టిన అర్బన్ రీసర్వే డిసెంబర్ 15 నాటికల్లా శతశాతం పూర్తి చేయాలని కమిషనర్ పి.నల్లనయ్య సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. గురువారం ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించిన అర్బన్ రీసర్వే శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 90 శాతం రీసర్వే పూర్తయిందన్నారు. అయితే మరింతగా కృషి చేసి డిసెంబర్ 15 నాటికి శతశాతం రీసర్వే పూర్తి కావాలన్నారు. ప్రణాళిక, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సమన్వయంతో రీసర్వే సమర్థవంతంగా చేపట్టాలన్నారు. రీసర్వే నిర్వహణలో నిర్లక్ష్యంగా వహించిన వారి పట్ల కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రీసర్వే చేపట్టే విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు ఐవి రమణమూర్తి, ఎల్. హరిబాబు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, వీఆర్వోలు, పరిపాలన, ప్రణాళిక, రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలకు నోటీసులు : కమిషనర్

అనధికార నిర్మాణదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. గురువారం 50వ డివిజన్ వైయస్సార్ నగర్‌లో ఆయన పర్యటించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. వైఎస్ఆర్ నగర్ లో అత్యధికంగా అనధికార నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే కొన్ని ఇళ్ల ముందు కాలువలను ఆక్రమించి షెడ్లు వేసినట్లు గమనించారు. వీటిని తక్షణమే తొలగించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. కాలువల సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు తెలియచెప్పడంతో అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి భవిష్యత్తులో సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని కమిషనర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, వివిధ విభాగాల సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీలు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంఇఒలు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నెల్లిమర్ల: మండలంలోని తంగుడుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు గణిత ఉపాధ్యాయులు శివ్వల బంగారయ్య తన సొంత ఖర్చుతో గణిత దీప్తి స్టడీ మెటీరియల్ అందజేశారు. పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు ఎంఇఒలు యుఎస్ఎన్.మూర్తి, ఈవు విజయకుమార్ చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్ పుస్తకాలు పూర్తిగా ప్రాక్టీసు చేసి అందరూ మంచి మార్కులతో పాస్ అయ్యి బంగారయ్య ఆకాంక్ష నెరవేర్చాలని కోరారు. గణిత ఉపాధ్యాయులు పాఠశాలలో జరిగే ప్రతి కార్యక్రమంలో ముందుండడం, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పుస్తకాలు,పెన్నులు, ప్లాంకులు కొనివ్వడం పట్ల ఆయన్ను అభినందించారు.

ఇంటింటా సర్వే చేయాలి

బాడంగి: గ్రామాల్లో ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు ఇంటింట సర్వే చేసి రోగులను గుర్తించి వారికి వైద్యం అందించే దిశగా పనిచేయాలని ఎంపిడిఒ రామకృష్ణ ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మెడికల్ అండ్ హెల్త్, ఐసిడిఎస్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరికైనా ఏదైనా రోగం ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత వైద్యులకు తెలిపి వైద్యం అందించాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎక్కడ వాటర్ పైప్ లీకేజీ ఉన్న వెంటనే దాన్ని పరిష్కరించేలా ఉండాలన్నారు. క్లోరినేషన్, ట్యాంక్ క్లీనింగ్ వెంటనే చేయించాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి, ఐసిడిఎస్ ఎఇ, మెడికల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

వేపాడ: మండలంలోని సింగరాయి, సోంపురం సచివాలయాలను, ప్రాథమికోన్నత పాఠశాలను, అంగనవాడి కేంద్రాన్ని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను, సిబ్బంది విధి నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలను, అంగనవాడి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో ఉన్న వీధులను పరిశీలించి సీసీ రోడ్లకు ఇరువైపులా ఉన్న కాలువల్లో చెత్తను తీయించాలని, ప్రధానంగా సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో సమయం పాటించాలని, వీధులు పరిశుభ్రంగా ఉంచే బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని స్పష్టం చేశారు. పరిశీలనలో గ్రామ సర్పంచ్ ఎన్ వెంకట్రావు, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, అంగనవాడి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

వైద్య శిబిరం పరిశీలన

బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో కన్నా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాల్లోనే వైద్య సేవలు మెరుగుగా ఉన్నాయని అన్నారు. వైద్యాధికారి డాక్టర్ ఎల్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

శృంగవరపుకోట : మండలంలోని సంత గౌరమ్మపేట రైతు సేవ కేంద్రంలో మండల వ్యవసాయాధికారి కె రవీంద్ర గురువారం రైతులకు ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ నూర్చిన తరువాత ధాన్యంలో 17 తేమ ఉండాలన్నారు. ధాన్యం మద్దతు ధర పొందడానికి రైతులు నాణ్యతలో ఎటువంటి ప్రమాణాలు పాటించాలో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విఎఎ రవి, గ్రామ పెద్దలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన నీటిని అందించాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీలో పరిశుభ్రమైన తాగు నీటిని అందించాలని కమిషనర్ కె.అప్పలరాజు సూచించారు. గురువారం నగర పంచాయతీ పరిధి జరజాపు పేట (లక్ష్మీ దేవిపేట)లో కమిషనర్ తాగు నీటి పథకాల క్లోరినేషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పథకాలు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి పరి శుభ్రమైన తాగు నీరు అందించాలని సూచించారు. పారిశుధ్య పనులు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ డి.ఉమా భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాయిరాల విజయ్‌కుమార్

ఘనంగా దేవాలయ సిల్వర్ జూబ్లీ వేడుకలు

వంగర: మండలంలోని శివ్వాంలో క్రీస్తు రాజు దేవాలయ సిల్వర్ జూబ్లి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆ గ్రామంలో క్రీస్తు రాజు దేవాలయం ప్రారంభించి 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా క్రీస్తు రాజు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు శ్రీకాకుళం మేత్రాన అధిపతి రాయిరాల విజయ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. క్రైస్తవ గురువులకు సన్మానాలు చేశారు. జూబ్లీ వేడుకలు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి క్రైస్తవ మత గురువులు హాజరయ్యారు.

బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

భోగాపురం: పూసపాటిరేగ మండలంలోని తిప్పలవలస గ్రామంలో బెల్టు షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సిఐ రవికుమార్ తెలిపారు. మురపల్లి అప్పన్న గ్రామంలో బెల్టుషాప్ నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు తెలిపారు. ఆయన వద్ద నుంచి 29 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇటీవల కాలంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులతో పాటు 54 మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వారి సమాచారం ఇస్తే దాడులు చేస్తామని ఆయన తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

మెరక ముడిదాం: జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు బుధరాయవలస ఎస్ఐ జె. లోకేష్ కుమార్ తెలిపారు. ఈనెల 5న గర్భాం గ్రామానికి చెందిన తాడ్డి రాంబాబు బైరిపురం నుంచి గర్భాం బైక్ మీద వస్తుండగా గర్భాం నుంచి బైరిపురం ఎదురుగా వెళుతున్న ఒక వ్యాన్ ఢీ కొట్టడంతో రాంబాబుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే జిల్లా కేంద్రంలో ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన గురువారం మృతి చెందారు. మృతుని భార్య ఉమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చిట్టీల కేసులో నలుగురు అరెస్ట్

భోగాపురం : చిట్టీలు వేసి ప్రజలను మోసగించిన నలుగురు వ్యక్తులను భోగాపురం పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. భీమిలికి చెందిన అలిపిలి అరుణ్ కుమార్, కొమర కనకమహాలక్ష్మి, తగరపువలసకు చెందిన చోడిపిల్లి సంధ్యారాణి, గాజువాకకు చెందిన తోడిపల్లి ప్రభ చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నారు. చెరుకుపల్లి గ్రామానికి చెందిన పలువురు వీరి వద్ద చిట్టీలు కట్టారు. తిరిగి సొమ్ము చెల్లించకపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన వీరిని ఎస్ఐ సూర్య కుమారి బుధవారం విశాఖపట్నంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రజాశక్తి - విజయనగరం కోట

అంతర్జాతీయ కేన్సర్ డేని పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.రాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన సుమారు 14 లక్షల మందికి, మూడు రకాల కేన్సర్లకు స్క్రీనింగ్ చేసి రోగులను గుర్తించి వారిని మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. ముఖ్యంగా రొమ్ము, గర్భసంచి ముఖ ద్వారం, నోటి కేన్సర్లకు సంబంధించి పరీక్షలు చేసి చికిత్స అందిస్తామన్నారు. ఈ రోజు నుంచి ఇంటింటా స్క్రీనింగ్ ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విబివి సుబ్రహ్మణ్యం, డిసిహెచ్ ఎస్ రాజేశ్వరి, జిజిహెచ్ సూపరింటెండెంట్ అప్పలనాయుడు, డెమో వి.చిన్న తల్లి, డిపిహెచ్ఎన్ఒ ఎం సత్యవతి, జిల్లా ఎపిడమాలజిస్ట్, డెమో సెక్షన్ సభ్యులు, ఎన్‌సిడి సెక్షన్ సభ్యులు, డిఎంహెచ్ఒ ఆఫీస్ స్టాఫ్, నర్సింగ్ విద్యార్థులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

పూసపాటిరేగ: జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం పూసపాటిరేగ పిహెచ్‌సి వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రాజేష్ వర్మ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో, గ్రామాల్లో కేన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించామన్నారు. పొగ తాగడం వల్ల, పొగాకు ఉత్పత్తులు నమలడం వల్ల, మద్యం తాగడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. గొంతు కేన్సర్, నోటి కేన్సర్లు, ఊపిరితిత్తుల కేన్సర్లు, గర్భాశయ, రొమ్ము కేన్సర్లు ఎందుకు వస్తాయో వివరించి నివారణకు అవగాహన కల్పించారు. ఎన్‌సిడి 3.0 భాగంగా రాబోయే రోజుల్లో హెల్త్ స్టాఫ్ ఇంటింటికి తిరిగి కేన్సర్ సంబంధించిన తనిఖీలు నిర్వహించి, అవగాహన కలిగించి, ముందుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి తగిన చికిత్సలు ఇప్పి అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివ్య-పోలిపల్లి మెడికల్ ఆఫీసర్, పిహెచ్‌సి హెల్త్ సిబ్బంది, సిహెచ్ఒ ఎం. వేదమని, హెల్త్ ఎడ్యుకేటర్ వి.మహేశ్వర, హెల్త్ సూపర్వైజర్లు ఉమాపతి, ఆర్.నాయుడు ఆరోగ్య సహాయకులు ఆర్‌వి రమణ, బంగారు బాబు, ఎల్‌హెచ్‌విలు ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: అవగాహనతోనే క్యాన్సర్‌ను జయించగలమని డాక్టర్ మానస తెలిపారు. జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా కొట్టాం పిహెచ్‌సి డాక్టర్ జె.హరిక ఆదేశాల మేరకు గురువారం మండలంలోని గల ఐదు సబ్ సెంటర్ల సిబ్బంది, సిహెచ్ఒలు, ఎఎన్ఎంలతో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ సిహెచ్.కళ్యాణి, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: కొత్తవలస, వియ్యంపేట పిహెచ్‌సిల వైద్యాధికారులు డాక్టర్ గోపాలకృష్ణ, సీతల్ వర్మ ఆధ్వర్యంలో గురువారం సిబ్బంది జాతీయ కేన్సర్ నిర్మూలన అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వైద్యధికారులు మాట్లాడుతూ మారిన ఆహార అలవాట్లు, బాగా శుద్ధి చేసిన ప్యాకెజిడ్ ఫుడ్, శీతల పానీయాలు, పొగాకు, మద్యం, అధిక కొవ్వు వుండే పదార్థాలు తీసుకోవడం వల్ల అవయవాలు పని తీరు దెబ్బ తింటుందన్నారు. శ్రమ లేని జీవన శైలి కూడా కారణం అని తెలిపారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం, యోగ వంటివి పాటించాలని కోరారు. కేన్సర్ ప్రాథమిక దశలో గుర్తిస్తే చాలా వరకు నయం అవుతుందన్నారు. అనంతరం కేన్సర్‌పై విజయం సాధిద్దాం అని ప్రతిజ్ఞ చేశారు.

విజయనగరం : ర్యాలీ చేస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది, వైద్యులు

బొబ్బిలి : కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని రోటరీ క్లబ్ చైర్మన్ జేసీ రాజు, పూర్వ అధ్యక్షులు వారణాసి శ్రీహరి, కోశాధికారి ఎన్.శ్రీనివాస్ అన్నారు. స్థానిక గిరిజన బాలికల వసతి గృహంలో గురువారం సాయంత్రం కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలమన్నారు. శరీరంలో ఎక్కడ కణితలు వచ్చిన, ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే రక్త పరీక్షలు చేసుకోవాలని కోరారు. కణితలు ఉన్న, అధిక రక్తస్రావం అయిన కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టూరిజం హోటళ్ల ఏర్పాటుపై ఐహెచ్‌సిఎల్ బృందం పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు టాటా సంస్థకు చెందిన ఐహెచ్‌సిఎల్ ఆసక్తి కనబరుస్తోంది. ఈ సంస్థ ప్రతినిధుల బృందం గురువారం జిల్లాలో పర్యటించి పలు ప్రాంతాల్లో పర్యాటక హోటల్స్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేసింది జిల్లా అధికారులతో మాట్లాడి హోటళ్ల ఏర్పాటుకు గల అవకాశాలను తెలుసుకుంది. ఐహెచ్‌సిఎల్ గ్రూపు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రోహన్ రానడే నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం గురువారం జిల్లాలో పర్యటించి, పర్యాటక రంగంలో పెట్టుబడులకు గల అవకాశాలను పరిశీలించింది. జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తో కలిసి ఈ బృందం సభ్యులు తొలుత భోగాపురం ఎయిర్‌పోర్టులో భాగంగా ఏర్పాటు చేయనున్న ఏరోసిటీని సందర్శించింది. ఆ ప్రాంతంలో పర్యాటక హోటల్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను కలెక్టర్ కార్యాలయంలో కలిసి జిల్లాలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చించారు. భోగాపురం ఎయిర్ పోర్టుతో పాటు జిల్లా కేంద్రంలోనూ, తాటిపూడి రిజర్వాయర్ వంటి ప్రదేశాల్లోనూ హోటల్స్, రిసార్టులు ఏర్పాటు చేస్తే పర్యాటక అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. భోగాపురం నుంచి మధురవాడ వరకు ఐటి హబ్‌గా అభివృద్ధి చేసే యోచనలో ప్రభుత్వం వుందని, అందువల్ల ఈ ప్రాంతం హోటల్స్, రిసార్ట్ లు ఏర్పాటుకు అనువైన ప్రదేశమని ప్రతినిధి బృందానికి కలెక్టర్ వివరించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తదితరులు ప్రతి బందం సభ్యులకు బొబ్బిలి వీణ అందించి సత్కరించారు.


భోగాపురం: జెసితో మాట్లాడుతున్న బృంద సభ్యులు

అనంతరం బందం సభ్యులు తాటిపూడి జలాశయం ప్రాంతాన్ని పరిశీలించారు. పర్యటనలో జిల్లా పర్యటక అధికారి లక్ష్మీనారాయణ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, ఎపిఇడిబి ప్రతినిధి రామేశ్వర్, ఎపిటిఎ ప్రతినిధి రాంప్రసాద్, ఎపి పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ రమణ పాల్గొన్నారు.

తాజ్ హోటల్‌కు స్థల పరిశీలన

భోగాపురం :విమానాశ్రయం సమీపంలో సముద్ర తీరాన ప్రముఖ హోటల్స్ సంస్థ తాజ్ గ్రూపు హోటల్ నిర్మాణానికి ముందుకు వచ్చింది. ఆ సంస్థ ప్రతినిధులు గురువారం స్థల పరిశీలన చేశారు. కంచేరు రెవెన్యూలో ప్రభుత్వం వద్ద దిబ్బలపాలెం సమీపంలో ఉన్న భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ చూపించారు. ఈ భూములు తమకు అనుకూలంగా లేవని తాజ్ యాజమాన్య సంస్థ తెలిపింది. తమకు సముద్ర తీరానికి దగ్గరగా ఉన్న భూములు అనుకూలంగా ఉంటాయని అలాంట భూములు కావాలని తెలిపారు. తీరానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించి తెలియజేస్తామని జెసి వారికి తెలిపారు. వారి వెంట తహశీల్దార్ సురేష్, విఆర్ఒ నారాయణస్వామి నాయుడు ఉన్నారు.

రాజకీయ ప్రమేయాన్ని అరికట్టాలి : లోక్‌సత్తా

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణ ప్రణాళిక విభాగంలో రాజకీయ ప్రమేయాన్ని అరికట్టాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టణ ప్రణాళిక విభాగంలో రాజకీయ జోక్యంతో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాజకీయ జోక్యం వల్లనే బొబ్బిలి-బలిజిపేట రహదారి విస్తరణలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు జారీ చేసిన టిడిఆర్ బాండ్ల జారీలో పారదర్శకత లోపించిందన్నారు. టిడిఆర్ బాండ్లు జారీలో అక్రమాలు జరగడం వల్లనే విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేశారని చెప్పారు. బహుళ అంతస్తుల భవనాల ప్లాన్లు నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చినట్లు ఆరోపణలు రావడంతో రెండేళ్ల క్రితం అవినీతి నిరోధక శాఖ అధికారులు దర్యాప్తు చేశారన్నారు. రాజకీయ నాయకులు ఒత్తిడితోనే టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చెరువు గట్లు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్న పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ శాఖలో రాజకీయ జోక్యాన్ని నివారించి అవినీతికి చోటు లేకుండా పారదర్శకంగా పాలన అందించాలని డిమాండ్ చేశారు.

మూడు నెలలుగా పస్తులే

- ఎంపిడిఒ, తహశీల్దార్‌కు 104 సిబ్బంది వినతి
- పలు చోట్ల 108 సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - జామి

గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, కుటుంబాలను పోషించటం కూడా చాలా కష్టంగా ఉందని ఆవేదనతో 104 సిబ్బంది, గురువారం ఎంపిడిఒ అప్పలనాయుడు, డిప్యూటీ తహశీల్దార్ నారాయణ మూర్తిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, ఇఒకు జిఒ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి.యఫ్ తిరిగి చెల్లించాలని 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలని, డిఎస్‌సి ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు. ఉద్యోగులకు యాజమాన్యం నుంచి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కృష్ణంరాజు, సన్యాసినాయుడు, సూర్యనారాయణ, కొట్రావు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది

108 సిబ్బంది నిరసన

రెండు నెలల జీతాల బకాయిల విడుదల, వార్షిక ఇంక్రిమెంట్ వంటి అనేక సమస్యలతో సతమతమవుతున్న 108 సిబ్బంది సమస్యలు పరిష్కారం కోరుతూ నిరసన కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. గురువారం జామి, ఎస్.కోట, ఎల్.కోట వాహనాల సిబ్బంది నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వ అధికారుల దృష్టికి కూడా పలుమార్లు మెమొరాండం రూపంలో తీసుకెళ్లామన్నారు. ఇప్పటి వరకు సరైన స్పందన లేక సమస్యలు పరిష్కారం కాక ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్యలపై వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారి సమక్షంలో యాజమాన్యం, ఉద్యోగ సంఘం ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.20వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి- డెంకాడ

భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 9,10,11 తేదీల్లో రాష్ట్ర స్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల నిర్వహణకు పాఠశాల పిఇటిలు ఆర్థిక సహాయం కోరగా టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖరరావు క్రీడాకారులును ప్రోత్సహిస్తూ గురువారం తన స్వగృహంలో రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించారు.

మహిళల తైక్వాండో పోటీలకు 'సీతం' విద్యార్థి

ప్రజాశక్తి- విజయనగరం

స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగానికి చెందిన సి.హెచ్. యశస్విని అఖిల భారత అంతర్ విశ్వ విద్యాలయం మహిళల తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. గత నెలలో ఎంవిజిఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన అంతర్ కళాశాల తైక్వాండో పోటీల్లో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జెఎన్‌టియు గురజాడ జట్టుకు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామమూర్తి తెలిపారు. ఈమె ఈనెల 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోనే అమృతసర్‌లో ఉన్న గురునానక్ యూనివర్సిటీలో జరగబోయే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యాన్ని ప్రదర్శించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ తమ తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని యశస్వినికి అభినందించారు.

శృంగవరపుకోట : రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టు

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌కు జిల్లా జట్టు

శృంగవరపుకోట: 10వ సీనియర్ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ విజయనగరం మెన్, ఉమెన్ కోచింగ్ క్యాంప్ మండలంలోని డాక్టర్ వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ గౌరీపురంలో నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8,9,10 తేదీలలో నంద్యాల జిల్లాలో జరగబోయే అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజయనగరం జిల్లా తరపున పాల్గొంటారని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్రెసిడెంట్ టీ. శ్రీనివాస్ రావు, సెక్రటరీ జి. లక్ష్మణ రావు తెలిపారు. ఈ కోచింగ్ క్యాంపునకు డాక్టర్ వరలక్ష్మి, ప్రిన్సిపాల్ భార్గవ్ రామ్ ఆర్థిక సాయం అందజేశారన్నారు. స్టేట్ మీట్‌లో కూడా రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

వాలంటీర్లకు న్యాయం చేయండి

విజయనగరంకోట : వాలంటీర్లకు ఇచ్చిన మాట ప్రకారం వారికి న్యాయం చేసేలా అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. గురువారం వాలంటీర్లంతా బాలాజీ జంక్షన్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. సిఎం వాలంటీర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు వాలంటీర్లు అందరికీ న్యాయం చేస్తారని ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆవేదన అర్థం చేసుకొని వారందరినీ కొనసాగించాలని కోరారు. ఈనెల 11నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో వాలంటీర్లుకి న్యాయం జరగకపోతే దశల వారీ పోరాటాలకు కార్యాచరణ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వాలంటీర్ల సంఘం జిల్లా కన్వీనర్ రవీంద్ర, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

విజయనగరం టౌన్ : గుర్ల సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి పాలవలస ఫీడర్‌పై లైన్ల కింద ఉన్న చెట్లు కొట్టేందుకు, మెయింటినెన్స్ పని నిమిత్తం పలు గ్రామాలకు విద్యుత్తు అంతరాయం కలుగుతుందని విజయనగరం డివిజనల్ ఇంజినీర్ త్రినాధరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు గరికి వలస , గోవుపేట, కొండగండ్రేడు, పకీరుకిత్తలి, ముద్దాడ పేట, మునకాల పేట, గేదల పేట, బూర్లు పేట గ్రామంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. రామతీర్థం- నెల్లివాడ సబ్ స్టేషన్ పరిధిలో సువ్వానిపేట, దీపిలిపేట, కొత్తపేట , గొర్లెపేట , జగ్గారాజుపేట, దనాన్నపేట, కోరాడపేట, ఎటిఅర్ అగ్రహారం, నీలారాజుపేట , అప్పయ్యపేట, కుడిపి గ్రామాలకు కూడా విద్యుత్తు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

రోడ్లు వేశాం..బిల్లులు చేయండి

మున్సిపల్ కాంట్రాక్టర్ ఆవేదన

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీ అభివృద్ధికి అప్పులు చేసి సీసీ రోడ్లు వేస్తే బిల్లులు చేసేందుకు మున్సిపల్ అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని కాంట్రాక్టర్ చప్ప చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నెలలో స్వామివారి వీధిలో రూ.14లక్షలతో మూడు రోడ్లు, పోస్టాఫీసు సందులో రూ.6లక్షలతో ఒక రోడ్డు, కోరాడవీధి శ్మశానంలో రూ.5లక్షలతో రోడ్డు, ఓంకార్ థియేటర్ వెనుక రూ.5లక్షలతో రోడ్డు, మల్లమ్మపేటలో రూ.1.45లక్షలతో రోడ్డు నిర్మాణం చేస్తే బిల్లు ప్రాసెస్ చేసేందుకు అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. గతంలో పని చేసిన ఎఇ సురేష్ బిల్లులు ప్రాసెస్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. బిల్లులు మంజూరైన వెంటనే మున్సిపల్ అధికారులకు ఇవ్వాల్సిన పిపిలు ఇస్తున్న తమను ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అప్పులు చేసి పనులు చేస్తే సకాలంలో బిల్లులు చేయకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోవడంతో అప్పులు ఊబిలో కూరుకుపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి బిల్లులు ప్రాసెస్ చేసి బిల్లులు మంజూరు అయ్యేలా చూడాలని కోరారు.

రోడ్లపై పశువులను విడిచిపెడితే కఠిన చర్యలు

బొబ్బిలి: పట్టణంలోని రోడ్లుపై పశువులను విడిచిపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని జూబ్లీ రోడ్డు, మెయిన్ రోడ్డు, శ్వేతాచలపతి స్కూల్ రోడ్డు, తాండ్రపాపారాయ బొమ్మ రోడ్డు, మార్కెట్ రోడ్డు ప్రాంతాల్లో గురువారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూబ్లీ రోడ్డులో పశువుల పెంపకందారులు పశువులను కట్టకుండా రోడ్లుపై విడిచిపెట్టడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, పశువులను రోడ్లుపైకి విడిచిపెట్టే వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని, అప్పటికి వినకపోతే ఛార్జ్ షీట్ నమోదు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీను ఆదేశించారు. రోడ్లుపై చెత్త వేసిన వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లు, కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. జూబ్లీ రోడ్డులో నిర్మాణంలో ఉన్న భవనాలకు అనుమతులు ఉన్నాయో లేదో గుర్తించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కోరారు.

కృత్రిమ అవయవాలు పంపిణీ

కొత్తవలస: శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం మంగళపాలెంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయన గరం సహకారంతో సుమారు 25 మంది వికలాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు, వీల్‌చైర్స్, పోలియో కాలిపర్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయనగరం కార్యకర్తలు మామిత గుప్త, జి.శిరీష, కల్పనా కుక్రేజ, సునీత జైన్, లక్ష్మి శ్రీనివాస్, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్, గురుదేవ హాస్పిటల్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, హాస్పిటల్ వైస్ చైర్మన్ డాక్టర్ వి.ఫణీంద్ర, ట్రస్ట్, హాస్పిటల్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

వేపాడ: మండలంలోని కరకవలస, చామలాపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా వంటగది, తరగతి గదులు, టాయిలెట్స్, విద్యార్థులతో పాఠాలు చదివించడం విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలన చేశారు. సిఆర్‌పి రాంప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్ సెంటర్ వద్ద జంగిల్ తొలగింపు

వేపాడ: మండలంలోని సింగరాయి జంక్షన్ వద్ద బస్సు షెల్టర్ చుట్టూ దట్టమైన ముళ్లపొదలు, డొంకలు, పిచ్చి మొక్కలను గురువారం పారిశుధ్య కార్మికులతో జగ్గయ్యపేట ఉప సర్పంచ్ వంటాకు శ్రీను, సింగరాయి సర్పంచ్ ఎన్ వెంకటరావులు చొరవ చూపి తొలగించారు. దట్టమైన పిచ్చిమొక్కలు బస్ షెల్టర్ చుట్టూ ఉండటం వల్ల పాములు వచ్చే ప్రమాదం ఉందని వాటిని తొలగించామని చెప్పారు.

మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
HMOP : 36/2024

పిటిషనరు : ఉండ్రాల శ్రీకాంత్
Vs
రెస్పాండెంట్ : ఉండ్రాల జాన్సీ అలియాస్ పద్మావతి
అడ్రసు :
ఉండ్రాల జాన్సీ అలియాస్ పద్మావతి W/o శ్రీకాంత్, D/o మాచల్ల శ్రీనివాసరావు, R/o వీరసాగరం గ్రామం, బాడంగి మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు HMOP ప్రకటన పిటిషనరు రెస్పాండెంటుపైన విడాకులు కోరి దాఖలు చేయడమైనది. సదరు OP లో రెస్పాండెంటు శ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో తే **18-11-2024దిన ఉదయం గం॥ 10-30ని॥ల**కు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై ఆమెకు గల ఆక్షేపణలను తెలియజేయగలరు. అటులు కాని యెడల మీకు వ్యతిరేఖముగా తీర్పు ఇవ్వడం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు
ఐ.శ్రీరాములు నాయుడు
న్యాయవాది, రాజాం,
సెల్ : 9441289946